క్లుప్తంగా

నేడు ఓటరు చైతన్య ర్యాలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టే ఓటరు చైతన్య ర్యాలీని విజయవంతం చేయాలని నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఓటుహక్కుపై ప్రతిఒక్కరిలో అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. సాయంత్రం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉర్జిత్విల్లాస్‌లో మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


అమ్మవారి ఊరేగింపును నిర్వహిస్తున్న భక్తులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని మధుర గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ఊరేగింపును ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించి 69 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీకి చెందిన రంగా, దుర్గ ఇరువురు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు చోట్ల కలిపి 69 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న రంగ, దుర్గపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జేఈఈ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

హత్నూర(సంగారెడ్డి): ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన 19మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ వెంకటవివేకానంద శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 36 సీఓఈ కళాశాలల్లో హత్నూర కళాశాల 5వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో కళాశాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

విద్యార్థినులకు సన్మానం


అక్షయరాథోడ్‌ను సన్మానిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. బైపీసీ చదువుతున్న బైజాసభ 440 మార్కులకు గాను 437 మార్కులు సాధించింది. ఎంపీసీ చదువున్న అక్షయరాథోడ్ 470 మార్కులకు గాను 465 మార్కులను సాధించింది. ఈ మేరకు టీఎస్ యూటీఎఫ్ నాయకులు కాశీనాథ్ జాదవ్, నరేష్, సాయిలు తదితరులు కలిసి విద్యార్థినులను అభినందించారు. ద్వితీయ సంవత్సరంలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

శభాష్ పూజిత


పూజిత

హత్నూర (సంగారెడ్డి): హత్నూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పండుగ పూజిత ఇటీవల నిర్వహించిన బీసీ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు తెలిపారు. 4వ తరగతి చదువుతున్న పూజిత 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడంతో పాటు సీఓఈ పాఠశాలకు ఎంపిక కావడంతో అభినందించారు.

మూగ గోస

- గ్రాసం, నీరు కరువై విలవిల
- ఎండిపోయిన చెరువులు, కుంటలు
- మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు రైతుల పాట్లు
- నిరుపయోగంగా నీటితొట్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు


తాగునీటి కోసం వెళ్తున్న పశువులు

వేసవి కష్టాలు మూగజీవాలను సైతం వదలడంలేదు. ఎండ వేడిమికి తాళలేక తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పశువుల దాహార్తిని తీర్చేందుకు రైతులు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది. పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడటంతో మూగజీవాల కడుపు నింపేందుకు రైతులు గడ్డి కోసం అన్వేషిస్తున్నారు. మార్కెట్లో అధిక ధరకు గడ్డి (మేత) కొనుగోలు చేయలేక ఏమీచేయలేని పరిస్థితుల్లో రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటితొట్లు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

– జహీరాబాద్ టౌన్

జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే కుటుంబాలు అనేకం ఉన్నాయి. పశువుల వల్ల ఆదాయంతో కొంతవరకు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఎండకాలం కావడంతో పశుగ్రాసం లేక పశుపోషకులు నానా అవస్థలు పడుతున్నారు. ఎండల కారణంగా బీడు భూముల్లో పచ్చగడ్డి ఎండిపోవడంతో పశుగ్రాసం లేక పచ్చిగడ్డి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు బోరు బావుల కింద మొక్కజొన్నను పచ్చిగడ్డి కింద సాగు చేస్తూ విక్రయిస్తున్నారు.

పశుగ్రాసం రేట్లతో రైతుల బెంబేలు

పశుగ్రాసం రేట్లు పెరగడంతో తమకు శాపంగా మారిందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క గేదెకు సంవత్సరానికి కనీసం రూ.15 వేల పచ్చిగడ్డి అవసరమవుతుందని వాపోతున్నారు. కొంతమంది ఆర్థికంగా ఉన్న రైతులు ధర అధికమైనా పచ్చగడిని కొనుగోలు చేస్తుండగా.. చేతిలో డబ్బులు లేని రైతులు గత్యంతరం లేక పశువులను సంతలో అమ్ముకుంటున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు

జహీరాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి.


గోపన్‌పల్లిలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

పశువుల దాహార్తిని తీర్చడం కోసం గతంలో గ్రామాల్లో రూ.వేలు ఖర్చు చేసి నీటితొట్లను నిర్మించారు. వాటర్ షెడ్ పథకంలో భాగంగా మరికొన్నింటిని నిర్మించారు. కానీ.. నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో నేడు అవి బీటలు వారి అలంకారప్రాయంగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి ఎండలను దృష్టిలో పెట్టుకుని నీటి తొట్లల్లో నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పోషణ భారంగా మారింది

వర్షాభావ పరిస్థితులకు తోడు మండుతున్న ఎండలతో పశువులను పోషించుకునేందుకు భారంగా తయారైంది. పాడిగేదెలకు పచ్చిగడ్డి వేస్తేనే పాల దిగుబడి వస్తుంది. కానీ.. సరైన మేత లేకపోవడంతో పశువులు బక్కచిక్కుతున్నాయి. వేసవి కష్టాలతో చేసేదేమీలేక పశువులను జహీరాబాద్ సంతలో విక్రయించాను.

– గోపాల్, రైతు, నున్నంబట్టి తండా

పశుగ్రాసం సాగుతో ప్రయోజనం

పశువులు ఉన్నవారు పశుగ్రాసం సాగుపై దృష్టి పెట్టాలి. పశుగ్రాసంలో పలురకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. సబ్సిడీపై విత్తనాలు లభిస్తాయి. తక్కువ నీరు ఉన్న ప్రాంతంలో కూడా సాగు చేసుకోవచ్చు. పచ్చిమేత రుచిగా ఉండడం వల్ల ఇష్టంగా తింటాయి. పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది. రైతులు పశుగ్రాసం విక్రయించి లాభాలు పొందవచ్చు.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

క్రిస్టియన్‌లకు అండగా ఉంటాం

- గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించండి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: క్రిస్టియన్, మైనార్టీలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మే 4న పటాన్‌చెరులో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి చర్చి పాస్టర్ల సమావేశం సందర్భంగా నియోజకవర్గంలోని చర్చి పాస్టర్లతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో తెలంగాణ వాదం బలంగా వినిపించాలంటే మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 10 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలోని క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించడంతో పాటు సొంత నిధులతో 30కి పైగా చర్చిలు నిర్మించినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా శ్మశాన వాటిక కోసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయకుమార్, నగేష్‌యాదవ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడండి

- అధికారులకు సభ్యుల విజ్ఞప్తి
- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాభవానీ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం సాదాసీదాగా నిర్వహించారు. ఎంపీపీ సద్ది ప్రవీన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు వారి నివేదికలను సభకు వివరించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ వేసవికాలం కారణంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను కోరారు. అదేవిధంగా రెవెన్యూ పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గుమ్మడిదల నుంచి కానుకుంట వరకు చేపట్టిన రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదని వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. ఎంపీపీ ప్రవీన మాట్లాడుతూ గ్రామాల్లో ఎదురవుతున్న వివిధ సమస్యల పరిష్కారంతో పాటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీడీఓ గాయత్రి, తహసీల్దార్ గంగాభవానీ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు


ఎన్నికల మ్యానిఫెస్టో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఎం ఎన్నికల మ్యానిఫెస్టో బుక్‌లెట్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోదీ ప్రభుత్వాన్ని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. కార్మికులు, అన్నదాతలకు అండగా నిలుస్తున్న వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్పొరేట్లకు లాభాలు చేకూరుస్తూ నిత్యవసర వస్తువుల ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేశం, మానిక్, సాయిలు, అమర్, కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి వీరభద్రేశ్వరుడి జాతర

- ఐదు రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు


ముస్తాబైన వీరభద్రేశ్వరస్వామి ఆలయం

రాయికోడ్(అందోల్): సంగారెడ్డి జిల్లాలోని పురాతన శైవ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన రాయికోడ్ వీరభద్రేశ్వరస్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. ఈ నెల 27 నుంచి ఐదు రోజుల పాటు జాతర కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేసి ఉత్సవ రథాన్ని సిద్ధం చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఆలయ ముఖద్వారాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

తరలిరానున్న భక్తులు

ఉత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన భక్తులు ఏటా అధిక సంఖ్యలో తరలివస్తారు. భద్రకాళీ, వీరభద్రులు ఏక శిలపై ఎటువంటి ఆధారం లేకుండా ఉండటం ఇక్కడ విశేషంగా చెప్పవచ్చు. విగ్రహం 6.5 అడుగుల ఎత్తు, 6 అడుగుల వెడల్పు కలిగి ఉంటుంది. శిల సౌందర్యం అద్వితీయంగా ఉంటుంది.

జాతర కార్యక్రమాలు

- ఏప్రిల్ 27న ధ్వజారోహణం, శిఖరపూజ, భద్రకాళీ కుంకుమార్చన, వీరభద్ర అభిషేకం, బసవేశ్వర అభిషేకం, తదితర పూజలు ఉంటాయి.
- 28న మహారుద్రాభిషేకం, పల్లకీసేవ, అగ్నిగుండ, గణపతి హోమం, భద్రకాళీదేవి–వీరభద్రేశ్వర స్వాముల అభిషేకం, కల్యాణం, సాయంత్రం రథోత్సవం ఉంటుంది. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బీమ్కుందకు చెందిన సోమలింగ శివాచార్యులచే తీర్థప్రసదాల వితరణ, పెద్దరాజు పెద్దమ్మ మొదటి భాగం నాటక ప్రదర్శన ఉంటుంది.
- 29న మల్లికార్జునస్వామి, భద్రకాళీ, సమేత వీరభద్రుడికి సహస్ర బిల్వార్చన, వీరాంజనేయ పూజ, భజనలు ఉంటాయి.
- 30న భద్రకాళీమాత, వీరభద్రేశ్వరులకు అభిషేకం ,శతనామావళితో బిల్వార్చన, కుంకుమార్చన నాటక ప్రదర్శన రెండోభాగం ప్రదర్శన ఉంటుంది.
- వచ్చే నెల 01న వీరభద్రేశ్వర, స్వామి, భద్రకాళీ మాతలకు అభిషేకం, ఆకుల పూజ, దంపతుల పూజలను నిర్వహిస్తారు.
- 02వ తేదీన వీరభద్రేశ్వర భద్రకాళీమాత అభిషేకం , రాత్రికి ఉత్సవ రథం బసవేశ్వర ఆలయం నుంచి తిరిగి వీరభద్రేశ్వర దేవాలయానికి చేరుకుంటుంది. మూడో భాగం నాటక ప్రదర్శన ఉంటుంది.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సమత

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని కలివేములలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ సమత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరిధాన్యాన్ని విక్రయించాలని సూచించారు ఏ గ్రేడ్‌కు రూ.2వేలు, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.1980 చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ కమ్యూనిటీ కోఆర్డినేటర్ లక్ష్మినారాయణ, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు మల్లేశ్వరి, మంగమ్మ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్ తదితరులు

నారాయణఖేడ్: కంగ్టి మండల పరిధిలోని చాప్టా(కె)కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా సమన్వయ కర్త కరణం శ్రీనివాస్ తన అనుచరులతో రెండు రోజుల క్రితం బీజేపీలో చేరగా మనసు మార్చుకుని శుక్రవారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి తిరిగి సొంతగూటికి చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

ఆగిన వివాహం

- మరో అమ్మాయితో సంబంధం
- నిలదీసిన పెద్దలు, కుటుంబ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): వరుడు మరో అమ్మాయిని ప్రేమించి, పెళ్లికూడా చేసుకున్న విషయం వెల్లడవడంతో పెళ్లి ఆగిపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. మండల పరిధి శభాస్‌పల్లి గ్రామానికి చెందిన రమేశ్ స్థానికంగా ఉన్న ఓ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అదే పరిశ్రమలో పనిచేస్తున్న ఓ మహిళను ప్రేమించి తన కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆమెను పెళ్లికూడా చేసుకున్నాడు. ఈ క్రమంలో మెదక్ ప్రాంతానికి చెందిన మరో అమ్మాయితో మళ్లీ పెళ్లికి సిద్ధమయ్యాడు. అది శుక్రవారం పెళ్లి జరగాల్సిఉంది. అయితే రమేశ్ పెళ్లిచేసుకున్న ఆ మహిళ తనతో జరిపిన ప్రేమ, పెళ్లి వ్యవహారం గురించి వధువు కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో వారు గురువారం శభాస్‌పల్లికి చేరుకొని రమేశ్ కుటుంబ సభ్యులను నిలదీశారు. విషయం తెలియడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గ్రామ పెద్దలు, బంధువులు కల్పించుకుని శుక్రవారం జరగాల్సిన పెళ్లిని రద్దుచేశారు. రమేశ్ కుటుంబ సభ్యులకు జరిమానా కూడా విధించినట్లు తెలిసింది. అయితే తనను రమేశ్ ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేశాడని యువతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

ఆధునిక పద్ధతులను పాటించాలి

ఏడీఏ సంధ్యారాణి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు ఆధునిక సాగు విధానాలను అలవర్చుకోవాలని వ్యవసాయ సంచాలకురాలు సంధ్యారాణి పిలుపునిచ్చారు. మండల పరిధి దొంతి గ్రామంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక సాగువిధానం గురించి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెదజల్లే పద్ధతిలో సాగైన వరిపొలాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వెదజల్లే పద్ధతిలో సాగుచేయడం ద్వారా ఎకరాకు రూ.8వేలు ఆదా చేయవచ్చన్నారు. కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్, ఏఓ లావణ్య, ఏఈఓ మాజిద్ అలీ, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యతోనే ఉన్నత ఉద్యోగాలు

నర్సాపూర్: ఉత్తమ విద్యతోనే రికార్డుస్థాయిలో విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్ర రాజగోపాల్ చెప్పారు. స్థానిక బీవీరాజు ఇంజనీరింగ్ కాలేజీ 27వ వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం కాలేజీ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు చేసిన ప్రధాన ప్రాజెక్టులతో జాతీయ స్థాయి అవార్డుల ద్వారా ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ప్రముఖ గాయకుడు శ్రీరామచంద్ర పాడిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబె, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏఓలు అశోక్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడగాలులతో అప్రమత్తత అవసరం


ధాన్యం తూకం పరిశీలిస్తున్న ఏఓ స్వప్న

వ్యవసాయ అధికారిణి స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): వాతావరణంలో మార్పుల వల్ల రెండు రోజులపాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని ఏఓ స్వప్న సూచించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. తూకంతోపాటు తేమశాతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం అమ్మే రైతులు పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను నిర్వాహకులకు అందజేస్తే సకాలంలో డబ్బులు అందుతాయని చెప్పారు. రైతులు ఎండలో పనులు చేయవద్దని ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, భిక్షపతి రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని గడ్డపోతారం గ్రామంలోని పులిగిళ్ల ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాల అధ్యక్షులు హుస్సేన్, రాజేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

◆ ఘనంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామంలో శుక్రవారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం నిర్వహించిన బోనాలు, అగ్నిగుండ ప్రవేశం, ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఆశిరెడ్డి, చింటుగౌడ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

◆ అగ్ని ప్రమాదాలపై అవగాహన

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వేసవి శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలను ఎలా ఆర్పి వేస్తారో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ అంజయ్య, వైద్యురాలు శిల్ప, బ్రహ్మకుమారి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ దైవచింతనతో ముక్తి

హత్నూర(సంగారెడ్డి): దైవ చింతనతోనే ముక్తి లభిస్తుందని పంచదామా పీఠాధిపతి కాశీనాథ్ బాబా అన్నారు. శుక్రవారం హత్నూర మండలం తహర్ఖాన్ పేట హనుమాన్ మందిరస్తంభ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ బాబా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలని సూచించారు.

◆ బీజేపీలో చేరిక

ఝరాసంగం(జహీరాబాద్): స్థానిక బీఆర్‌ఎస్ ఎంపీటీసీ రజినిప్రియ పాటిల్ పలువురు నాయకులతో కలిసి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఎంపీటీసీ విజయేందర్‌రెడ్డి, నాయకులు సంతోష్ కుమార్ పాటిల్, సత్యనారాయణ సింగ్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

◆ తడ్కల్‌లో బీజేపీ శ్రేణుల ప్రచారం

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో బీజేపీ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తడ్కల్, సాధుతండా తదితర గ్రామాలకు చెందిన కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

◆ వైభవంగా సిద్దేశ్వరుడి ఉత్సవాలు

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలో శ్రీసిద్దేశ్వరుని ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండం నిర్వహించారు. ఉత్సవమూర్తుల ఊరేగింపులో శివసత్తుల నృత్యాలు భక్తులను అలరించాయి.

◆ రోడ్ షోను జయప్రదం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేయనున్న రోడ్ షో, కార్నర్ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చ ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, సత్యనారాయణ, నాగేశ్‌యాదవ్ దితరులు పాల్గొన్నారు.